# అనుమాన పిశాచం

శ్రీమతి. బి. సరోజినికమల.

క్రిష్ణమూర్తి బి.యల్ ప్యాసయి ప్లీడరీ ప్రాక్టీసు కాకినాడలోనే పెట్టాడు కృష్ణమూర్తి తండ్రిలేదు, తల్లి మాత్రంవుంది. వేరే నా అన్నవాళ్ళెవరూలేరు. పెండ్లిచేసుకొని ఒకయింటివాడవుకమ్మని తల్లి ప్రతిరోజుపోరేది. కాని ఏమిలాభం! తన వేదాంతానికి, తన నియమానికి తగినభార్య దొరికితే గాని పెండ్లి చేసుకోగూడదని కృష్ణమూర్తి పట్టుదల. ఆడవాళ్ళను నమ్మరాదని వాదించేవారిలో యితడొకడు. ఆఖరికి చూచి రామయ్య అనే సామాన్యభూస్వామి కూతురిని, తల్లి బలవంతముననైతేనేం మరెలానయితేనేం వివాహం చేసుకున్నాడు.

శాంత థర్డుఫారమువరకూ చదివింది. మంచి నిమ్మపండు చాయ. ఆ నల్లనికళ్ళకుతోడు, ముంగురులు నొసటపడుతూంటే ఎంతో అందమనిపిస్తుంది. పాటలంటే ఆమెకు చాల సరదా, కాని క్రిష్ణమూర్తికివన్నీ సరిపడవు. సంసారికి చదువెందుకు, పాటలెందుకు అనే వుద్దేశము అతనిమనసులో వుందేదికాని పైకిఅనలేదు. ‘క్రొత్తగదా, ఇంకా కొన్ని రోజులయినతర్వాత నిదానముగా ఒకటొకటి చెపుతామ’ని అనుకొనేవాడు. ఒక్కొక్కరోజు వేదాంతము, దైవభక్తి శాంతకు అర్ధమయ్యేటట్లు ఘంటలకొలదిబోధించేవాడు. శాంతకుఇదియిష్టంకాదు-కాని వినకపోతే భర్తకు కోపమువస్తుందనే భయముతో అలానే నిల్చుని వినేది. లేకపోతే ఈ లేత వయస్సులో ప్రేమ, శృంగారము అనుభవించగలిగినవానికిబదులు ఈ వేదాంతమేమిటా, ఈ సన్యాసికి పెండ్లెందుకా అనుకొనేది. సినిమాలు, మీటింగులు, షికారులు, అంటే క్రిష్ణమూర్తి మండేవాడు. ఆడవాళ్ళకివన్నీ ఎందుకనేవాడు.

ఒకరోజు ధైర్యముచేసి ‘ఏమండీ మనము ప్రతిరోజూ షికారుకు వెళ్ళితే ఎంత బావుంటుంది చూడండీ, సినిమాకు నన్నొకమారైనా మీరు తీసుకెళ్ళలేదేగదా? ఈరోజు మంచి పిక్చరు కన్నన్బాలది. వెళ్ళుదామండీ" అన్నది శాంత.

అనగానే క్రిష్ణమూర్తి కెక్కడలేనికోపమూ వచ్చింది. "ఆ, సినిమా కావాలా? ఇంకేం పాకం ముదిరిందే! ఏమో పసిదానివిగదా అని స్వేచనువిచ్చినందుకు ఎంతవరకూ వచ్చావ్! సంసారులు సినిమాలు చూస్తే యింకేమయినా వుందీ? అయినా నిన్ననడము నాదే బుద్ధిపొరపాటు. చదివినదాన్ని నే పెళ్ళాడకూడదని అనుకున్నా; ఎలానో బుద్ధిపొరపాటయిపోయింది. నీరూపు చూచి అప్పుడు ముగ్ధుడనైపోయాను. ఎందుకులే ఇవన్నీ,—అసలు పెండ్లాడకనే వుండవలసింది. నాదే పొరపాటు" అంటూ ఈ విధముగా సాధించాడు.

శాంతకేమీ తోచలేదు. లోపలికి వెళ్ళి పండుకొని ఎంతోసేపు యేడ్చింది. క్రిష్ణమూర్తి బయటికెళ్లాడు. సాయంత్రము 5 గంటలయింది. శాంత లేచి జడ వేయించుకోటానికి పక్కింటి కెళ్ళింది. అప్పుడే పక్కింటి ఇన్స్పెక్టరుగా రబ్బాయి యువకుడూ, ఎఫ్. ఏ. పాసయి సెలవుల్లో ఇంటికివచ్చి వున్నాడు. ఇన్స్పెక్టరుగారు ఇంటిలోలేరు. వారి అబ్బాయి అమ్మాయిలు అందరూ కలిసి టౌను హాలులో మీటింగుకు వెళుతున్నారు. శాంతను చూడగానే, "ఇంకా జడ వేసుకోలేదేమమ్మా. త్వరగా బయలుదేరు. మీటింగుకు వెళదామ"న్నది వారి పెద్దమ్మాయి రాజ్యం. "నేను రానక్కయ్యా, మీరెళ్ళరండి, నేను జడ వేయించుకుందామని వచ్చాను. అమ్మచేతనే వేయించుకుంటాను. మీరెళ్ళి రండ"ని చెప్పింది ఎంతో వ్యసనముతో. సరే అని వారంతా వెళ్ళిపోయారు.

శాంత ఇన్స్పెక్టరుగారి భార్యచేత జడ వేయించుకొని ఇంటికి వస్తూవుంది, క్రిష్ణమూర్తి ఎదురుపడ్డాడు, ఆ ఇది కనిపెట్టవలె ఇకమీదట అని "ఎక్కడికి వెళ్లావు" అన్నాడు. "పక్కింటికి వెళ్ళాను" అన్నది. "వాళ్ళ అబ్బాయి వున్నాడు ఇంట్లో" అన్నాడు ఎందుకో తెలియకుండా. "ఆ వున్నాడు. నే వెళ్ళిన కొంతసేపటి వాళ్ళందర్నూ కలిసి, మీటింగు కెళ్ళారు" అన్నది శాంత.

అనగానే మూర్తికి అరికాలిమంట తలకెక్కింది. "ఇకమీదట బయటికి వెళ్లావంటే చూడు నీపని! కొంత చనువిస్తే ఈ ఆడజాతి తల కెక్కుతుందం"టూ, తిన్నగా తల్లిదగ్గరకు వెళ్ళి "ఏమిటమ్మా, నీమాట విని తెలివి తక్కువ పని చేశాను. నా కెక్కడదొరికిందోయిది భార్యగా? భర్త గుణాలకు తగిన భార్య దొరకనప్పుడు సంసారమెట్లా సాగుతుంది? నీవైనా యింటిలో వుండే దానివి, దాన్ని బయటికి వెళ్ళనివ్వకుండా చూస్తూ వుండరాదూ. ఎప్పుడూ పాటలూ, సినిమాలుదీనికిదేపని, ఎప్పుడో తీస్తుందిదొడు నాకు తెలుసు" నన్నాడు.

"ఛీ ఏమిటిరా ఆమాటలు అది పసిబిడ్డ, దానికేం తెలుసురా దాన్నంటావు! ఈకాలం వాళ్ళను చూసైనా నేర్చుకోరాదూ? ఏమీ తెలియనిపిల్ల, దానికి నేరాలెన్నుతున్నావా? నీవే నేర్పించేటట్లుంది దానికి" అని తల్లి అన్నది. "ఆ సరే. దానితో చేరినావూ, నువ్వూ. ఇక అయినట్లే! నేను సన్యాసం పుచ్చుకోవటంమంచిది. ఇంకా కొన్నిరోజులు చూసి అంత పనీ చేస్తా"నన్నాడు.

ఒకనాడు సాయంత్రము 6 గంటలకు క్రిష్ణమూర్తి కోర్టునుంచివస్తున్నాడు, ఇంతలో, తన ఇంటిలోనుండి ఎవ్వరో పక్కింటి ఇన్స్పెక్టరు గారింటికి వెళ్ళినట్లు అగుపడింది. వెంటనే ఆలోచన చేయసాగాడు: "వాళ్ళదాసీదికాదుగదా, వుత్తరము తీసికొని వెళ్ళుతున్నదా, అలానైతే. వాళ్ళ అబ్బాయికూడా వుత్తరం పంపివుంటాడు! ముందెవరు పంపివుంటారు?" అని ఈవిధమైన ఆలోచనలతో యిల్లుచేరాడు. శాంత అప్పుడే మొహం కడుక్కొని తువాలుతో తుడుచుకుంటూ, ‘హృదయము హాయిగను, మనకోర్కెలు దీరెగదా" అని పాడుతూ దొడ్లోనుండి తనకెదురుగా వస్తూవుంది. క్రిష్ణమూర్తి కోటుకూడా విప్పకుండా తిన్నగా దొడ్లోకెళ్ళి, పక్కింటిలోకి తొంగిచూశాడు. ఇన్స్పెక్టరుగారి అబ్బాయి అప్పుడే స్నానము

చేస్తున్నాడు, అనుమానము బలమైంది. ఆపాటకు అర్థమేమిటంటూ లోపలికెళ్ళి గుడ్డలుతీస్తూ ఆలోచించసాగాడు. ఆ రాత్రిభోంచేయలేదు. శాంత పిలిచినా పలుకలేదు. ఈవిధముగా ఒకవారముగడిచింది.

శాంత ఎంతోవినయముతో సేవచేస్తూనేవున్నది. తన తప్పేమి? ఆరాత్రి శాంతభర్త ప్రవర్తనను గురించి చాలా ఘాటుగా అడుగుదామని ధైర్యము చేసుకుంది. పడకగదిలోకెళ్ళింది. "ఏమండీ అప్పుడే నిద్రా" అన్నది.

పలుకలేదు. బిర్రబిగుసుకున్నాడు కృష్ణమూర్తి. "ఏమండీ పలుకరాదూ, మీరెందు కట్లావూరికే అనుమానములపాలై మీరుకష్టపడుతూ, నన్ను కష్టపెడుతారు? మీమనస్సులో యేమిటోఎప్పటికప్పుడుఅడిగి తెలుసుకోరాదా? లోకంలోభార్యభర్తలేలావున్నారు, మనమెలావున్నాము? ఇట్లా అనుమానపడుతోంటే సంసారములో సంతోషమెట్లాకలుగుతుందండీ? మీకు తెలియదా! నాచేత పలికించాలనా యివన్నీ" ఇక మాట్లాడలేకపోయింది. గుడ్డ అడ్డముంచుకొని ఏడ్వసాగింది.

కృష్ణమూర్తి ఆలోచన చేయసాగినాడు; అట్లావుండేటట్లయితే ఇది నా కెందుకింత సేవ చేస్తుంది. నే మాట్లాడకున్నా బలవంతముగా నన్ను మాట్లాడించుతుంది. చూస్తాము మంచి మాటలతో ఏమైనా తేలుతుందేమో అనితనలో తాను అనుకొని అయితే నీ ప్రవర్తనమును గురించి నా కనుమానం వుంది; నీవు అన్నీ నాతో చెప్పితే నీ నేరాన్ని విని క్షమించుతాను, వూరికే ఈ ఏడ్పు కట్టిపెట్టు" అన్నాడు....అనగానే శాంత ఇక విన లేక దీనముగా ఆతని కండ్లలోకి చూస్తూ ఏడ్వసాగింది. ఆ చూపుతో నిరపరాధి అనిపించింది అతన్ని. ఈ దెబ్బతో తిరిగింది అబ్బాయి తత్వం! లేచాడు. లేచి, శాంతనుఒళ్ళోకితీసికొని, "పిచ్చిదానా, నీ గుణం కనిపెడుతూ వున్నాను. అంతేగాని నిజంగా నిన్ను నమ్మకకాదు. ఎందుకేడుస్తావు!ఏదీ ఇప్పటికయినా చెప్పు- నిజంగా నీవుచేసిన నేరమంతా. నేనేమీ అనను. అన్నీ క్షమించితీరుతాను. చెప్పవూ శాంతా, నా శాంతా" అంటూ బుజ్జగించ సాగినాడు.

"ఛీ, ఛీ, ఏమండీ మీరింత నీచపుమాటలు అడగడం నేచేశిన నేరమేమిటో" అన్నది. ధైర్యంగా.

"కోపమెందుకు శాంతా, అనాడు నీవు జడ వేయించుకొనడానికి పక్కింటికి వెళ్ళినప్పటినుండి నాకు అనుమానమయింది. దాంతో వాళ్ళ దాసీది ఆ మర్నాడు రావడం, నీవు వాండ్లమ్మాయి అతో ఎక్కువ స్నేహంముగా వుండటం ఆరోజే నేను వచ్చేటప్పుడు నీవు పాడుతూవున్న ఆపాట కర్థమేమో నాకు స్ఫురించలేదు. అప్పుడే వెళ్ళి దొడ్లో చూశానుగదా,—ఇన్స్పెక్టరుగారబ్బాయి స్నానంచేస్తూ దొడ్లో వున్నాడు. నా అనుమానం బలమైంది" అన్నాడు. అనగానే శాంత పక్కున నవ్వి "నా నిర్మలమైన ప్రేమనుగూర్చి పరిహాసానికైనా నన్ను మీరిలాఅనరాదు సుమా. మీకు అనుమానం కలిగినప్పుడు నాతో చెప్పివుంటే నాకింత మనస్సుకు కష్టము గలుగదు గదా! మీ అనుమానమే గాని, అ అబ్బాయితో నేను మాట్లాడే ఎరగను; చివరకు ముఖముకూడా సరిగా చూచి ఎరుగను, మీరెందుకో వట్టి అనుమానం మనస్సున వుంచుకొని మీరు కష్టపడి, నన్ను కష్టపెట్టారు; ఒట్టు నన్ను నమ్ముతారా నమ్మరా? ఆ అబ్బాయి, మా అన్నయ్యతో సమానమని ఇప్పుడే కాదు ఎప్పటికైనా; మీరు మీ ఇష్టమొచ్చినట్లు నన్ను పరిక్ష చేసుకోండి, అంది!

"లేదు, లేదు, శాంతా, నేటినుండి నీ ప్రవర్తనను బాగా కనిపెట్టాను, చిన్నదానివైనా, నా యీ నేరాన్ని క్షమించు శాంతా, నా అనుమాలిము తీరింద"న్నాడు.

"అదే పదివేలు" అన్నది. శాంత.

మరునాటినుండి, సంతోషమునకై సాయంత్రము ఐదుగంటలకు బీచిషికారు వెళ్ళే వారు శాంతా క్రిష్ణమూర్తులు, సినిమా కెళదామా శాంతా అనేవాడు మూర్తి అప్పుడప్పుడు, ఎందుకులెండి అనేది శాంత, చాలులే సరసమని బుగ్గమీద చిటుకవేశేవాడు మూర్తి. మూర్తి తల్లి ఈ ప్రేమజీవులను చూస్తూ తన కొడుకు ముందటి క్రిష్ణమూర్తేనా అనుకొనేది.


# హస్తరేఖాశాస్త్రము.



విశదముగా తెలియగల 300చిత్రములతోగూడి స్త్రీలు బాలురు సైతము చదువుట కనుకూలించు తేట తెల్లమగు నాంధ్ర వచనరూపమగు నీగ్రంధముచేత ఆయుస్సు వివాహలాభము, గుణము, శక్తి, బుద్ధి అదృష్టము, సంతానము లౌకిక సుఖము వ్యాజ్యము, శక్తి ఐశ్వర్యము, గండము, జయము, వ్యాధి, ఋణము, అపాయము మోసము, జ్ఞానము, దుఃఖము, కార్యసిద్ధి, దయ మరణము మొదలగు ననేక విషయములను సులభముగా దెలిసికొనవచ్చును. ఇంక, విధిప్రేరణము, జీవిత రహస్యములను తెలియజేయుటకై గల్గు సాధనంబు లన్నింటిలోను యిది యగ్రస్థానంబును వహించియున్నది. భూత భవిష్య ద్వర్తమానంబులని చెప్పబడు త్రికాల వృత్తాంతంబులను దెలియుటకు ఈ గ్రంథము కల్పవృక్షము వంటిదని దీని నామూలాగ్రము ఒక్కమారు చదువువారే చెప్ప సాహసింతురనుట కెంతయు సందియంబు లేదు, దీని వెల 2—0—0

సౌకారుపేట, ఆనందబోధిని ఆఫీసు. మదరాసు.